క్లుప్తంగా

నాడు-నేడు పనుల పరిశీలన


పనులు పరిశీలిస్తున్న ఎంఈఓ శ్రీదేవి

నగరి : మండలంలోని గుండ్రాజుకుప్పం దళిత వాడ మండలపరిషత్ ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను ఎంఈఓ శ్రీదేవి పరిశీలించారు. మంగళవారం పాఠశాలకు వెళ్లిన ఆమె పనులు జరుగుతున్న తీరుపై ఆరాతీశారు. నాణ్యత తగ్గకుండా పనులు చేపట్టాలని, జరిగే పనులకు సంబంధిత బిల్లులు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు.

పట్టణంలో పందుల బెడద


వర్షపు నీటిలో సంచరిస్తున్న పందులు

నగరి : ప్రస్తుతం కురిసిన వర్షాలకు ఖాళీ స్థలాల్లో నీరు నిల్వ చేరుతుండడంతో పందుల సంచారం ఎక్కువైంది. మున్సిపల్ పరిధిలోని తిరుపతిరోడ్డు గోకులం లాడ్జి సమీపం ఉన్న ఖాళీ స్థలంలో వర్షపు నీరు ఎక్కువగా నిల్వ కావడంతో పందులు గుంపులుగా చేరుతున్నాయి. పర్యావరణాన్ని అపరిశుభ్రం చేస్తున్నాయి. జనావాస ప్రాంతాల్లో పందులు సంచరించకుండా ఇటీవలే మున్సిపల్ అధికారులు పందుల పెంపకందారులకు హెచ్చరికలు జారీ చేశారు. అయినా వారిలో మార్పు రావడం లేదు. దీంతో పట్టణవాసులకు పందుల బెడద తప్పడం లేదు. పందుల సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

తాగునీటి సమస్య పరిష్కారం


మరమ్మతులు చేస్తున్న కూలీలు

వెదురుకుప్పం: మండలంలోని తిరుమలయ్యపల్లె పంచాయతీ షికారీ కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను స్థానిక సర్పంచ్ భారతి పరిష్కరించారు. గ్రామానికి నీటిని సరఫరా చేసే పైపులైన్లు పగిలి నీటి కొరత ఏర్పడింది. దీంతో కాలనీవాసులు సమస్యను సర్పంచ్ దృష్టికి తీసుకురావడంతో స్పందించి కొత్తగా పైపులు అమర్చి నీటిని సరఫరా చేసేందుకు చర్యలు తీసుకున్నారు.

సిబ్బంది బాధ్యతగా పనిచేయాలి


సూచనలు చేస్తున్న ఎంపీడీఓ శ్రీదేవి

గంగాధరనెల్లూరు: గ్రామ సచివాలయ సిబ్బంది బాధ్యతగా పనిచేయాలని ఎంపీడీఓ శ్రీదేవి కోరారు. మండలంలోని నెల్లేపల్లి గ్రామసచివాలయాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసి సూచనలు చేశారు. ఎంపీడీఓ మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని, సమయపాలన తప్పక పాటించాలన్నారు. వేసవికాలంలో తాగునీటి సమస్య లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. సర్పంచ్ రవీంద్రారెడ్డి, ఈఓపీఆర్డీ శివయ్య పాల్గొన్నారు.

నీటి కోసం యుద్ధాలు జరగొచ్చు


జడ్జి రాఘవేంద్ర

పుత్తూరు రూరల్: భవిష్యత్‌లో నీటి కోసం యుద్ధాలు జరుగుతాయని చెప్పడంలో అతిశయోక్తి లేదని పుత్తూరు మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు, సీనియర్ సివిల్ జడ్జి ఎస్‌సీ రాఘవేంద్ర తెలిపారు. ప్రపంచ జల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన బుధవారం ప్రతి ఒక్కరూ నీటి పొదుపుపై మంచి నిర్ణయం తీసుకోవాలని ఒక ప్రకటనలో కోరారు. సమస్త జీవరాసుల మనుగడకు జీవనాధారం అయిన నీటిని పొదుపు చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. నేడు అభివృద్ధి పేరిట నీటిని వృథా చేస్తున్నామని, ఇది ఏమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు. ఐక్యరాజ్యసమితి మార్చి 22న ప్రపంచ జల దినోత్సవం జరుపుకోవాలని ప్రకటించిందని తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు


మరమ్మత్తులుచేసిన ట్రాన్స్‌ఫార్మర్

నింద్ర: మండల కేంద్రమైన నింద్రలో దళితవాడకు విద్యుత్ సరఫరా చేసే విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ అకాల వర్షాలకు మరమ్మతులకు గురైంది. సర్పంచ్ బాబురెడ్డి అధికారులతో మాట్లాడి మంగళవారం ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

విద్యార్థుల ఆరోగ్యానికి రాగిజావ

- జగనన్న గోరుముద్ద పథకంలో రాగిజావ అందించడానికి శ్రీకారం
- విద్యార్థులకు మరిన్ని పోషకాలు అందాలన్నదే ప్రభుత్వధ్యేయం
- నియోజకవర్గవ్యాప్తంగా ప్రతి స్కూల్‌లో రాగిజావ పంపిణీ


నగరిలో విద్యార్థులకు రాగిజావ అందిస్తున్న మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం

నగరి : ప్రతి విద్యార్థికి సంపూర్ణ పోషణ అందించాలన్న దృక్పథంతో జగనన్న గోరుముద్ద పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మధ్యాహ్నం అందిస్తున్న భోజనంలో మరిన్ని పోషకాలు పెంచేందుకు రాష్ట్రప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. జగనన్న గోరుముద్ద పథకంలో ఇప్పుడు అందిస్తున్న మెనూలో రాగిజావను చేర్చి మంగళవారం నుంచి పంపిణీ ప్రారంభించారు. స్థానిక పీసీఎస్ ఉన్నత పాఠశాలలో మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ వారానికి మూడు రోజుల పాటు మంగళ, గురు, శనివారాల్లో విద్యార్థులకు రాగిజావ అందిస్తుందని, తద్వారా పిల్లల ఆరోగ్యానికి మంచి పోషకాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీదేవి, కౌన్సిలర్ దయానిధి, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. నెత్తం కండ్రిగ మండల పరిషత్ ప్రాథమిక స్కూల్‌లో ఎంపీపీ భార్గవి రాగిజావ పంపిణీ ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కన్నియప్ప, కౌన్సిలర్ రమేష్ రెడ్డి, నాయకులు భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు. పట్టణంలోని అన్ని పాఠశాలల్లో ఆయా వార్డుల కౌన్సిలర్లు, పంచాయతీల పరిధిలో సర్పంచ్‌లు, విద్యాకమిటీ చైర్మన్లు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు విద్యార్థులకు రాగిజావ అందజేశారు.

నింద్రలో..

నింద్ర: విద్యార్థుల్లో మంచి పోషకాలు అందేలా రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం అన్ని స్కూళ్లలో రాగిజావ పంపిణీకి శ్రీకారం చుట్టినట్లు ఎంపీపీ దీప తెలిపారు. ఈ సందర్భంగా మండలకేంద్రంలోని హైస్కూల్‌లో ఆమె విద్యార్థులకు రాగిజావ పంపిణీ చేశారు. అలాగే మండలవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థులకు రాగిజావ అందజేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.


నెత్తం కండ్రిగ స్కూల్ విద్యార్థులకు రాగిజావ అందిస్తున్న ఎంపీపీ భార్గవి


మిట్టపాళెంలో విద్యార్థులకు రాగిజావ అందిస్తున్న విద్యాకమిటీ చైర్మన్


నింద్ర: శ్రీరామాపురం స్కూల్‌లో..

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం


సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మహిళలు

కార్వేటినగరం: మహిళలు ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని సర్పంచ్ పుష్పాంజలి అన్నారు. మంగళవారం ఈడిగపల్లిలో వినాయక స్వామి ఆలయం వద్ద మహిళా పొదుపు సంఘాల సభ్యులతో కలిసి నిర్వహించిన సమీక్షలో వైఎస్సార్ ఆసరా పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ అన్ని రంగాల్లో మహిళలకు పురుషులతో సమానంగా అవకాశాలు కల్పించిన ఘనత సీఎం జగనన్నకే దక్కిందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రతి పథకాన్ని మహిళల పేరుతో ప్రవేశపెట్టి ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ సందర్భంగా భారీ కేక్ కట్ చేశారు. అనంతరం జగనన్న చిత్రపటానికి డ్వాక్రా మహిళలు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో డ్వాక్రా మహిళలు, సచివాలయ సిబ్బంది, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నేడు ఉగాది వేడుకలు

వెదురుకుప్పం: తెలుగు సంవత్సరాది ఉగాదిని పురస్కరించుకుని బుధవారం మండలంలోని డీఆర్‌ఎస్‌కండ్రిగ సమీపంలోని అరుణగిరిపై ఉన్న జ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పంచాంగ శ్రవణంతో పాటు ప్రత్యేక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అదేవిధంగా చవటగుంటలోని ద్రౌపదీ సమేత ధర్మరాజుల ఆలయంలో పంచాంగ శ్రవణం, కురివికుప్పం గ్రామ దేవత ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు, రాత్రి ద్రౌపదీ మానసంరక్షణ వీధి నాటక ప్రదర్శన ఉంటుందని తెలిపారు.

ప్రభుత్వ స్కూళ్లలోనే మెరుగైన విద్య


మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యులు అన్బళగన్

పాలసముద్రం : ప్రభుత్వ స్కూళ్లలోనే గ్రామీణ ప్రాంతాల పేద విద్యార్థులకు ఉన్నతవిద్య అందుతుందని జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్ తెలిపారు. మంగళవారం బలిజకండ్రిగ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎం రఘు నేతృత్వంలో పదో తరగతి విద్యార్థులకు సమీక్ష నిర్వహించారు. కార్యక్రమానికి విచ్చేసిన జెడ్పీటీసీ అన్బళగన్ మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు ఇష్టపడి చదివితే మంచి మార్కులు సాధించవచ్చని తెలిపారు. ప్రభుత్వం విద్యకు మొదటి ప్రాధాన్యత ఇస్తోందని, అందులో భాగంగా నాడు–నేడు పథకంలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారని తెలిపారు. జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా విద్యార్థులకు వారంలో మూడురోజులు రాగిజావ కూడా విద్యార్థులకు అందిస్తున్నారని తెలిపారు. రిటైర్డ్ హెచ్‌ఎం రాజామణి మాట్లాడుతూ జరుగనున్న పబ్లిక్ పరీక్షల్లో మొదటిస్థానంలో వచ్చిన వారికి నగదు బహుమతి ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ సిబ్బందితో సమీక్ష


మాట్లాడుతున్న ఎంపీడీఓ విద్యావతి

పాలసముద్రం : మండల పరిధిలో జాబ్‌కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి ఉపాధిహామీ పథకంలో పనులు కల్పించాలని ఎంపీడీఓ విద్యావతి తెలిపారు. మంగళవారం ఆమె ఉపాధిహామీ సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఉపాధిహామీ పథకంలో పనులు చేస్తున్న కూలీల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. మే నెల నుంచి ప్రతి పంచాయతీలో 200 మందికిపైగా కూలీలు ఉపాధిహామీ పనుల్లో పాల్గొనేలా చూడాలన్నారు. ముఖ్యంగా పనులు నాణ్యతగా చేయాలని హెచ్చరించారు. కార్యక్రమంలో జేఈ అనుషా, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

ముందస్తు ఉగాది వేడుకలు


మహిళలకు ఉగాది కానుకలు అందజేస్తున్న బ్యాంకు మేనేజర్

పుత్తూరు రూరల్: పట్టణంలోని రాష్ట్రీయ సేవా సమితి (రాస్) కార్యాలయంలో మంగళవారం ముందస్తు తెలుగు సంవత్సరాది ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన స్థానిక బ్యాంక్ ఆఫ్ ఇండియా మేనేజర్ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ పొదుపు సంఘాల్లోని మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించి, కుటుంబ బాధ్యతల్లో పాలుపంచుకోవాలని సూచించారు. ఇందుకు తమవంతు కృషి చేయాలని సూచించారు. అనంతరం మహిళలకు పసుపు, కుంకుమ, గాజులు అందించారు. ఉగాది పచ్చడిని పంచిపెట్టారు. కార్యక్రమంలో రాస్ అధికారులు పాల్గొన్నారు.

వాహనాల వేలం రేపు

పుత్తూరు రూరల్: వివిధ కేసుల్లో సీజ్ చేసిన ద్విచక్ర వాహనాలను ఈనెల 23న పుత్తూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్‌ఈబీ) కార్యాలయంలో బహిరంగ వేలం వేయనున్నట్లు సీఐ ఎస్.కృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు పది వాహనాలకు వేలం వేస్తామని చెప్పారు. ఆసక్తి గల వారు రుసుం చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు.

రాగిజావతో పోషకలోప నివారణ


పాలసముద్రంలో..

వెదురుకుప్పం : పిల్లల్లో పోషక లోప నివారణకు ప్రభుత్వం రాగిజావ అందజేస్తున్నట్లు జెడ్పీటీసీ సభ్యుడు సుకుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం మధ్యాహ్న భోజన మెనూలో కొత్తగా అందిస్తున్న రాగిజావను మాంబేడు పాఠశాలలో ఆయన రాగిజావను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పిల్లల్లో ఐరన్, కాల్షియం తగ్గకుండా ఉండేందుకు రాగిజావ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బండి గోవర్ధన్‌రెడ్డి, సర్పంచ్‌లు భువనేశ్వరి, శశికుమారి, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం : స్థానిక వనదుర్గాపురం చలమరాజు ఇళ్ల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు హీహెచ్‌సీ కమిటీ చెర్మన్ శివప్రకాష్ రాజు రాగిజావను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నరసింహరాజు, హెచ్‌ఎం రాజా, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కార్వేటినగరంలో..

కార్వేటినగరం: మండల కేంద్రంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ రాగిజావా కార్యక్రమాన్ని హెచ్‌ఎం గాయత్రీదేవి ఆధ్వర్యంలో ప్రారంభించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ధనంజయవర్మ ఎంపీడీఓ మోహన్‌మురళి, మండల కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, పాఠశాల కమిటీ చైర్మన్ చాముండేశ్వరి, వైస్ చైర్మన్ మమత, ఎంఐఎస్ కోఆర్డినేటర్ రేఖ, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పలువురు పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరులో..

గంగాధరనెల్లూరు: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని వైస్‌ఎంపీపీ హరిబాబు మంగళవారం లాంఛనంగా ప్రారంభించారు. అలాగే మండలంలోని అన్ని పాఠశాలల్లో స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొని రాగిజావ పంపిణీ చేశారు.


విద్యార్థినులకు రాగిజావను పంపిణీ చేస్తున్న జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ


జీడీనెల్లూరులో ..

ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి


రాజమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి ఆర్‌కే రోజా

పుత్తూరు రూరల్: ఆత్మీయులను కోల్పోయినప్పుడే ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని పర్యాటక శాఖ మంత్రి ఆర్‌కే రోజా అన్నారు. పుత్తూరు పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మునెయ్య తల్లి రాజమ్మ ఇటీవల మృతి చెందారు. విషయం తెలిసి మంత్రి మంగళవారం వారి ఇంటికి వెళ్లి రాజమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆమె మాట్లాడుతూ ఆత్మీయులను కోల్పోయిన నాయకుల కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ అన్ని వేళలా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ హరి, కౌన్సిలర్ చిట్టిబాబు, నాయకులు ఈశ్వరయ్యయాదవ్, గోపాల్‌యాదవ్, శివయ్య, నారాయణ, మునిక్రిష్ణయ్య, రాఘవరెడ్డి, మునిరత్నం, బుజ్జి, కడియాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో మందులు పిచికారీ చేయాలి

వడమాలపేట : ఇటీవల కురిసిన వర్షాలకు మామిడి పంట దెబ్బతింటుందని దానికి సకాలంలో మందులు పిచికారీ చేయాలని ఏఓ విజయకుమార్ తెలిపారు. మామిటి పూత రెండోసారి, మూడోసారి వచ్చిన పూతల్లో తేనెమంచు, తామర పురుగులు వృద్ధి చెందడానికి అనుకూలమైన వాతావరణం ఏర్పడుతుందని దాని నివారణకు 13.0.45 మందును 10 గ్రాముల నీటికి చొప్పున, సల్ఫర్ బదులు బోరాన్ సూక్ష్మధాతువును 1 గ్రాము లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని కోరారు. దీని వల్ల పూత ఒక్కసారిగా వచ్చే అవకాశం ఉంటుందన్నారు. రెండు రోజులు కురిసిన వర్షాలకు గాలిలో తేమవల్ల ప్రస్తుతం మామిడి తోటల్లో తామర పురుగులు, నల్లతామర పురుగులు, తేనెమంచు, పచ్చ పురుగులు ఉధృతి ఎక్కువగా ఉందన్నారు. వీటి నివారణకు అసిఫేట్ 1.5 లీటర్లకు, ఫిప్రోనిల్ 1 మిల్లీలీటరు, కార్బండిజమ్‌ను 1 లీటరు నీటికి సమానంగా వేపనూనె 1500 పీపీఎం 2 మిల్లీలీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. రైతులు సకాలంలో జూన్, జూలై నెలలో కొమ్మలు కత్తిరింపు, ఎరువుల యాజమాన్యం, పచ్చిరొట్టే ఎరువులు వేయాలన్నారు. బోరాన్, జింక్ వంటి సూక్ష్మ పోషకాలు అందించడం వల్ల మామిడి పూత సకాలంలో వస్తుందని వివరించారు.

నల్లబ్యాడ్జీలతో నిరసన


నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పెనుమూరు(కార్వేటినగరం) : అసెంబ్లీ సాక్షిగా స్పీకర్ తమ్మినేని సీతారాంపై, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామిపై, ఎమ్మెల్యే సుధాకర్‌పై, దౌర్జన్యానికి పాల్పడిన టీడీపీ ఎమ్మెల్యేలపై కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని ఏఎంసీ చైర్మన్ బండి కమలాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం పెనుమూరులో వైఎస్సార్‌సీపీ నాయకులు నల్లబ్యాడ్జీలు ధరించి అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు దుష్ట చతుష్టయానికి నాయకుడిగా ఉంటూ వారి ఎమ్మెల్యేలను వైఎస్సార్‌సీపీ మంత్రులు, ఎమ్మెల్యేలపై ఉసిగొల్పి పవిత్రమైన అసెంబ్లీని యుద్ధకాండగా మార్చి పైశాచిక ఆనందం పొందుతున్నారని దుయ్యబట్టారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి దూది మోహన్, జిల్లా యువత కార్యదర్శి విజయకుమార్‌రెడ్డి, వడ్డెర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మనోహర్, సర్పంచ్ నవీన్‌కుమార్‌రెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి, మునీంద్ర, మురళి, మోహన్, చిన్నస్వామిరెడ్డి, నరసింహారెడ్డి, రాజారెడ్డి, రామకృష్ణారెడ్డి, యతీశ్వర్ నాయుడు, మధు తదితరులు పాల్గొన్నారు.

కుశస్థలి నది గట్టు శుభ్రం


నది గట్టును జేసీబీతో శుభ్రం చేస్తున్న దృశ్యం

నగరి : మున్సిపల్ పరిధిలోని కీళపట్టు గ్రామాన్ని ఆనుకుని కుశస్థలి నదిగట్టుపై ఏపుగా పెరిగిన ముళ్ల కంపలను, పిచ్చిమొక్కలను జేసీబీ సాయంతో స్థానిక యువకులు మంగళవారం శుభ్రం చేయించారు. నది గట్టును ఆనుకుని గుబురుగా పిచ్చిమొక్కలు ఉండడంతో అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారుతుండఢం, తమిళనాడు నుంచి వచ్చేవారు ఈ ప్రాంతాల్లో సంచరిస్తుండడంతో ఇబ్బంది మారింది. దీనికితోడు ఈ దారిలో వెళ్లే విద్యార్థులకు ఇబ్బందులు కలుగుతుండడంతో స్థానికులు చొరవ తీసుకుని నది గట్టును శుభ్రం చేసేందుకు పూనుకున్నారు. అసాంఘిక చర్యలు జరగకుండా గట్టి చర్యలు తీసుకోవాలని సివిల్ మెజిస్ట్రేట్ విష్ణువర్మకు మంగళవారం వారు వినతిపత్రం సమర్పించారు.

చెరుకు బకాయిలు ఇప్పించాలని వినతి

నింద్ర: మండలంలోని నేతమ్స్ షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం నుంచి అందాల్సిన రూ.36 కోట్ల బకాయిలు ఇప్పించేందుకు చొరవ చూపాలని కలెక్టర్ హరినారాయణన్‌కు రైతులు విన్నవించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఆయనకు వినతిపత్రం అందించారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ రైతుల బకాయిలు చెల్లించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రైతులు నారాయణస్వామి రెడ్డి, ఆదినారాయణ రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఎర్రచందనం దుంగలు స్వాధీనం


అరెస్టు చూపుతున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు

తిరుపతి అలిపిరి: భాకరాపేట రేంజి పరిధిలో మంగళవారం ఉదయం తొమ్మిది ఎర్రచందనం దుంగలను టాస్క్‌ఫోర్సు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఒక స్మగ్లర్‌ను అరెస్టు చేశారు. డీఎస్పీ మురళీధర్ ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్ బృందం భాకరాపేట రేంజ్ చామల ఈస్ట్ బీట్ పరిధిలోని నాగపట్ల సెక్షన్ పరిధిలో మంగళవారం ఉదయం కూంబింగ్ చేపట్టారు. అన్నదమ్ముల బండ వద్ద కొందరు వ్యక్తులు ఎర్రచందనం దుంగలను మోసుకుని వస్తూ కనిపించారు. పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేశారు. వారిలో ఒకరిని పోలీసులు పట్టుకున్నారు. తిరుపతి పేరూరు గ్రామం శ్రీనివాసపురానికి చెందిన సిద్ధరపు శ్రీనివాసులురెడ్డిగా గుర్తించారు. అతనితో పాటు వచ్చిన రేణిగుంట కురకాల్వకు చెందిన మణికంఠ, కర్ణాటకకు చెందిన వసీం పరారీలో ఉన్నారు. శ్రీనివాసులురెడ్డిపై గతంలో ఐదు కేసులు ఉన్నట్లు డీఎస్పీ తెలిపారు. 205 కిలోలు ఉన్న 9 దుంగల విలువ రూ.2.10 లక్షలు ఉంటుందని చెప్పారు. సీఐ చంద్రశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కూంబింగ్‌లో పాల్గొన్న సిబ్బందికి కర్నూలు రేంజి డీఐజీ సెంథిల్ కుమార్ రివార్డులు ప్రకటించారు.